
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జనగామ

శనివారం 13 జనవరి 2024

ఉద్యోగాల్లో శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, జనవరి 12: జిల్లా లోని నిరుద్యోగ యువతీ యువకులు విదేశాలలో ఉద్యోగాలు పొందేందుకు శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సీహెచ్.ఉమారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జపాన్, జర్మనీలలో నర్సింగ్ ఉద్యోగాల కోసం టామ్‌కామ్ కంపెనీ శిక్షణ ఇవ్వనుంది. ఇందు కోసం 22 - 30 వయస్సు కలిగిన బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు, 18 - 28 వయస్సు కలిగిన ఇంటర్ విద్యార్థులు ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తమ రెజ్యూమ్‌లను టామ్‌కామ్ డాట్ జెర్మనీ ఎట్ జీమెయిల్ డాట్ కామ్‌కు పంపాలన్నారు. వివరాలకు 89190 47600 నంబరులో సంప్రదించాలన్నారు.

ప్రణాళికతో పనులు చేయాలి

అధికారులకు కలెక్టర్ శివలింగయ్య ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ టౌన్, జనవరి 12: గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రణాళికతో నిర్వహించాలని కలెక్టర్ శివలింగయ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికీ తాగునీరు సరఫరాపై ఈ నెల 17 లోపు గ్రామాలవారీగా నివేదిక ఇవ్వాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఈజీఎస్‌లో కూలీలకు వంద రోజుల పని కల్పించాలని, ప్రతీ గ్రామంలో రోజుకు 50 మందిని పనిలోకి తీసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించిన వివరాలను వీక్లీ రిపోర్ట్ ద్వారా ఇవ్వాలన్నారు. ఈ నెల 17న మొదటి గ్రామ సభ, 20న రెండో గ్రామసభ నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ఈ నెలాఖరుకల్లా వంద శాతం పన్నులు వసూలయ్యేలా కృషి చేయాలన్నారు. అడిషనల్ కలెక్టర్ పింకేశ్‌కుమార్ మాట్లాడుతూ.. ఇంటింటికీ మరుగుదొడ్ల నిర్మాణం వంద శాతం పూర్తవ్వాలన్నారు. గ్రామపంచాయతీల్లో అన్ని విభాగాల్లో 70 శాతం పనుల్లో పురోగతి సాధించాలన్నారు. ఈ నెల 25లోగా పంచాయతీలు వారి ప్రణాళికలను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీవో రంగాచారి, సీపీవో ఇస్మాయిల్, డీఆర్‌డీవో మొగులప్ప, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలు, ఎంపీడీవోలు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో పన్నులు చెల్లించాలి..

జనగామ పట్టణ ప్రజలు వారం రోజుల్లోగా తమ ఇంటి పన్నులు, ట్రేడ్ లైసెన్సులు, ప్రకటనల చార్జీలు చెల్లించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. కొత్తగా వ్యాపారాలు ప్రారంభించిన వారు తప్పకుండా ముందే ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. ప్రకటనల బోర్డులు ఏర్పాటు చేసిన వారు గడువు ముగియక ముందే రెన్యువల్ చేసుకోవాలన్నారు. పన్నులు గడువులోగా చెల్లించకపోతే చర్యలుంటాయని హెచ్చరించారు.

ఉన్నట్టా.. ఊడినట్టా

అయోమయంలో పూజారులు

- గత జూన్‌లో అర్చకులను నియమించిన బీఆర్ఎస్ సర్కారు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 156 మంది నియామకం
- వారికి నేటికీ అందని గౌరవ వేతనాలు
- ధూపదీప నైవేద్యాలకు నిధులు కరువు
- కాంగ్రెస్ సర్కారు కొనసాగిస్తుందా లేదా అని అనుమానం





కొడకండ్ల శివాలయం

కొడకండ్ల, జనవరి 12: దేవాలయం అంటే నిత్యం ధూప దీప నైవేద్యాలతో, దేవుడికి నిత్య కైంకర్యాలతో అలరారే పవిత్ర స్థలం. విగ్రహ ప్రతిష్ఠ జరిగిన నాటి నుంచి నిత్యం ఆయాదేవుళ్ల ఆగమాలు, నియమాల ప్రకారం పూజలు చేయాల్సిన పుణ్య ప్రదేశం. ఎక్కువ ఆదాయం వచ్చే పెద్ద దేవాలయాలకు లోటు లేదు. కానీ ఎటొచ్చీ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న దేవాలయాల్లో, చిన్న దేవాలయాల్లో ఆదాయం ఏమీ ఉండదు కనుక ధూపదీప నైవేద్యాలకు కష్టమే. ప్రభుత్వానికి ఆదాయం వచ్చే ఆలయాలపైన ఉన్న శ్రద్ధ చిన్న దేవాలయాలపై కనిపించడంలేదు.

పేరుకే నియామకాలు..

రాష్ట్రంలోని గ్రామీణ దేవాలయాలలో ఇదివరకే ధూపదీపనైవేద్యం పథకంలో ఉన్న 3540 ఆలయాలతో పాటు జూన్ 2023లో కొత్తగా 2500ల ఆలయాలను గతప్రభుత్వం చేర్చింది. దాంతో కొత్తగా 2500ల మంది అర్చకులను నియమించారు. అందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో హనుమకొండ 30, వరంగల్ 20, మహబూబాబాద్ 30, జనగామ 30, భూపాలపల్లి 33, ములుగు 13 మొత్తం 156 మంది అర్చకులను నియమించారు. అంతేగాకుండా కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా 6 వేలు ఉన్న గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచారు. అందులో రూ.6 వేలు అర్చకుడికి, రూ.4 వేలు పూజా ద్రవ్యాలకు కేటాయించేలా ఆదేశాలిచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. నూతన నియామకాలు జరిగి 6 నెలలు గడుస్తున్నా.. ఇప్పటికి ఒక్క రూపాయి కూడా గౌరవ వేతనాలు అందలేదు. దీంతో ధూపదీప నైవేద్యాలు పెట్టేందుకు పూజారులు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు అగరువత్తులు, దీపం నూనె, కొబ్బరికాయలు తదితర పూజాసామగ్రికి విపరీతంగా ధరలు పెరగడంతో గత్యంతరం లేక అర్చకులు అప్పు చేసి కొనాల్సి వస్తోంది.

కొత్త ప్రభుత్వంపై ఆశలు..

కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో అర్చకులకు గౌరవవేతనం రూ.12 వేలు చేస్తామని చెప్పింది. అది ఎప్పుడు అమలు అవుతుందో తెలియదు. అర్చకులు మాత్రం కళ్లల్లో వత్తులేసుకొని ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం మారింది కనుక అసలు తాము ఉన్నట్టా.. లేనట్టా.. అర్థం కావట్లేదని నూతన అర్చకులు ఆందోళన చెందుతున్నారు.

దేవాలయ భూములు దేవుని పేరు మీదే..

నిజాం కాలంలో అన్ని కులవృత్తుల వారికి ఇచ్చినట్లే పూజారులకు కూడా ఇనాం భూములు ఇచ్చారు. ఆ భూమి సాగు చేసుకుని దేవుడికి ధూపదీప నైవేద్యాలు పెడుతూనే తన కుటుంబాన్ని వెళ్లదీసుకోవాలి. కాని, కాలక్రమంలో మిగతా వారు ఇనాం భూములను అమ్ముకున్నా పూజారులు మాత్రం ఆ భూములను అమ్ముకోకుండా కాపాడారు. ఉర్దూలో ఇనాం అంటే కానుక. అయితే కొంతకాలం క్రితం గత ప్రభుత్వం ఆ భూములను కూడా దేవాలయాలపైన రిజిస్ట్రేషన్ చేసింది. కాస్తుకాలమ్ నుంచి కూడా పూజారి పేరును తొలగించింది. అంటే కనీసం ఆ భూమిపై కరెంట్ కనెక్షన్‌కు కూడా దరఖాస్తు చేసే అవకాశం పూజారికి లేకుండా చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా కాస్తు కాలమ్‌లో అర్చకుడి పేరు చేర్చాలని కోరుకుంటున్నారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్న ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు గౌరవవేతనం అందించాలని కోరుతున్నారు.

జీవన వ్యయం విపరీతంగా పెరిగింది.

- కర్నె సాంబయ్య, భూపాలపల్లి జిల్లా గౌరవాధ్యక్షుడు, ధూపదీప నైవేద్య అర్చక సంఘం



ఎంత కుగ్రామంలోనైనా ప్రస్తుత కాలంలో చిన్న కుటుంబం గడవాలన్నా కనీసం రూ.25 వేలు అవసరం. కానీ గత ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.6 వేల గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచారు. అందులో 6 వేలు అర్చకుడికి, రూ. 4వేలు పూజాసామగ్రికి అని ప్రకటించారు. గత సంవత్సరం జూన్‌లో నియమించిన నూతన అర్చకులకు 6 నెలలు అవుతున్నా ఈనాటికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా అర్చకులకు న్యాయం చేయాలి. కాంగ్రెస్ మేనిఫెస్టోలో తెలిపినట్లు రూ.12 వేల గౌరవవేతనం సాధ్యమైనంత త్వరగా అమలు చేయాలి.

పోదాం పద జాతర..



చలువ పందిళ్లతో మల్లికార్జునస్వామి దేవస్థానం

ముస్తాబైన ఐనవోలు

నేడు ధ్వజారోహణం.. రేపు భోగి..

మల్లన్న చెంతకు పోటెత్తనున్న భక్తులు



ఐనవోలు, జనవరి 12: ఐనవోలు జాతరకు ముస్తాబైంది. ఈ నెల 13న శనివారం ధ్వజారోహణంతో జాతర ఉత్సవాలు ప్రారంభమై ఉగాది వరకు కొనసాగుతుండటం ఈ ఆలయ విశిష్టత. 14న భోగి, 15 మకర సంక్రాంతిని పురస్కరించుకుని రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, కలెక్టర్ సిక్తా పట్నాయక్‌లు జాతర నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష జరిపి సౌకర్యాలు కల్పించారు. ఎట్టకేలకు జాతరలో నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షణ బృందాన్ని ఏర్పాటు చేశారు.

మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. భక్తులు స్నానా లు చేసేందుకు బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌ను 6 చోట్ల ఏర్పాటు చేశారు. మహిళలు స్నానాలు చేశాక దుస్తులు మార్చుకునేందుకు 7 చోట్ల డ్రెస్సింగ్ రూం లను ఏర్పాటు చేశారు. ప్రాంగణంలో ఉన్న మూడు చోట్ల మరుగుదొడ్లను సులబ్ కాంప్లెక్స్‌కు అప్పగించారు. జాతరలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యేక ఫీడర్ ద్వారా ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశారు. జీడబ్ల్యూఎంసీ, పంచాయతీరాజ్ శాఖ దేవస్థానం నుంచి 300 మంది కార్మికులు పారిశుధ్య నిర్వహణను చేపట్టనున్నారు.

పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్..

పోలీసులు కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. జాతర పార్కింగ్ స్థలాలను ఖరారు చేసి రూట్ మ్యాప్‌ను విడుదల చేశారు. 10 చెక్‌పోస్టులు, 150 సీసీ కెమెరాలు, ప్రత్యేక గస్తీ, నిఘా బృందం, షీటీంలు పని చేయనున్నాయి. డ్రోన్ కెమెరాతో ట్రాఫిక్‌ను పర్యవేక్షించనున్నారు. మామునూరు ఏసీపీ సతీష్ బాబు, పర్వతగిరి సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై జి.అనిల్‌కుమార్‌ల నేతృత్వంలో సుమారు 400 పైచిలుకు మంది పోలీసు అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక బస్సులు

హనుమకొండ డిపోకు చెందిన సుమారు 130 బస్సుల ద్వారా జాతరకు భక్తులను చేర్చనున్నారు. వరంగల్ నుంచి ప్రతీ 15 నిమిషాలకు ఒక బస్సు ఐనవోలుకు బయలుదేరుతుంది. ఐనవోలు-కాజీపేట-కొమురవెల్లి- వేములవాడలకు భక్తులు వెళ్లే విధంగా రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం కొనసాగుతుందని ఆర్ఎం లలిత తెలిపారు.

భక్తులకు విస్తృత ఏర్పాట్లు

- అద్దంకి నాగేశ్వర్‌రావు ఐనవోలు ఈవో



జాతరలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నాం. ప్రధానంగా నీరు, పారిశుధ్యం, కరెంట్‌పై దృష్టి పెట్టి ఏర్పాట్లు చేశాం. దేవాదాయ శాఖ ఏర్పాట్లకు అదనంగా ఖర్చుచేసింది. ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అందరి సహకారంతో జాతరను విజయవంతం చేస్తాం.

వైద్య కళాశాలలకు నూతన ప్రిన్సిపాల్స్



డాక్టర్ భిక్షపతి రావు



డాక్టర్ రాజేంద్ర ప్రసాద్

హనుమకొండ అర్బన్, జనవరి 12: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలకు ప్రిన్సిపాళ్లను నియమిస్తూ వైద్య విద్య సంచాలకురాలు డాక్టర్ త్రివేణి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని ఎనిమిది కళాశాలలకు 2024-25 అకడమిక్‌కు ఈ నియామకాలు చేపట్టారు. హనుమకొండ కేఎంసీలోని జనరల్ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను ములుగు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా, కేఎంసీ జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.బిక్షపతిరావును నర్సంపేట వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు.

'చలో పార్లమెంట్' విజయవంతం

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం

జనగామ కల్చరల్, జనవరి 12: అందరికీ విద్య, అందరికీ ఉపాధి కల్పించాలని కోరుతూ శుక్రవారం చేపట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమం విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారని, దేశం నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులతో బీజేపీ వ్యతిరేక నినాదాలతో ఢిల్లీ దద్దరిల్లిందని, ఢిల్లీ పోలీసులు వేల సంఖ్యలో మోహరించినా విద్యార్థులు వెనక్కి తగ్గలేదని, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, అందరికీ ఉచిత విద్య అందరికీ ఉపాధి కల్పించాలని, భారతదేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరుతూ పార్లమెంట్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సందీప్, నాయకులు యాకన్న, సందీప్, విశాల్, మహేష్, స్రవంతి, అభినయ తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీలో 'మార్చ్ టు పార్లమెంట్' లో పాల్గొన్న ధర్మభిక్షం తదితరులు

హాస్టల్ గదిలో విద్యార్థిని ఆత్మహత్య



- మృతురాలు మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ కుమార్తె
- తేలని కారణాలు.. ఎన్నో అనుమానాలు..

రాథోడ్ దీప్తి (ఫైల్)

8లో..

ఘనంగా వివేకానంద జయంతి

నివాళులర్పించిన విద్యాసంస్థలు



జనగామ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న మెప్మా పీడీ హర్షవర్ధన్

వివరాలు : 8వ పేజీలో

కబడ్డీకి కేరాఫ్‌గా నిలుస్తున్న ఛాగల్

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- వేడుకగా క్రికెట్ పోటీలు ప్రారంభం



ఛాగల్‌లో కబడ్డీ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడియం

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 12: గత అరవై ఏళ్లుగా కబడ్డీ పోటీలను నిర్వహిస్తూ అనేక మంది క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దిన ఛాగల్ గ్రామం నేడు కబడ్డీకి కేరాఫ్‌గా మారిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం ఛాగల్ గ్రామంలో కడియం ఫౌండేషన్, స్వాగత్‌యూత్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 16వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కడియం మాట్లాడారు. ఛాగల్ గ్రామం నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులతో పాటు కోచ్‌లు కూడా తయారుకావడం గర్వకారణం అన్నారు. ప్రైవేట్ కంపెనీలు, ఫ్రాంఛైజ్‌లు ముందుకు వచ్చి ఐపీఎల్, ప్రో కబడ్డీ, హాకీ లీగ్, ఫుట్‌బాల్ లీగ్‌లను నిర్వహించడంతో అంతరించిపోతాయనుకున్న క్రీడలకు జీవం పోస్తున్నారని అన్నారు. గ్రామీణ యువత పెడదారి పట్టవద్దు అంటే వారి దృష్టిని క్రీడల వైపు మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడలతో యువకులు శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారని, అంతేకాకుండా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. కాగా, మూడు రోజులపాటు జరిగే ఈ టోర్నమెంట్స్‌కు జనగామ, నల్లగొండ, సూర్యాపేట, హైదరాబాద్, కరీంనగర్, హనుమకొండ, వరంగల్ జిల్లాల నుంచి 50 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిలిది వెంకన్న, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాపోలు మధుసూదన్ రెడ్డి, పొట్లపల్లి శ్రీధర్‌రావు, తీగల కరుణాకర్‌రావు, కనకం రమేష్, కోతి రాములుగౌడ్, అంబటి కిషన్‌రాజు, ఎల్లెని సుధాకర్‌గౌడ్, మాదిరెడ్డి రాఘవరెడ్డి, శాతరబోయిన సత్యనారాయణ, పొన్న రజిత-రాజేశ్, అన్నెపు బలయ్య, స్వాగత్ యూత్ అధ్యక్షుడు కొన్న రాజు, అన్నెపు కుమార్, పొన్న రాజేష్, రంగు యాదయ్య, ప్రజేష్, బొజ్జం సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలో తలపడుతున్న జట్లు

విద్యార్థుల సృజనకు పదును

- ఆన్‌లైన్‌లో ఇన్‌స్పైర్ మనక్ పోటీలు
- ఈ నెల 18 వరకు ప్రాజెక్టుల అప్‌లోడ్
- హనుమకొండ జిల్లాలో 103 ప్రాజెక్టుల ఎంపిక



ఇన్‌స్పైర్ మనక్ లోగో

హనుమకొండ రూరల్, జనవరి 12: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసే సమయం ఆసన్నమైంది. వారిని ప్రయోగాల వైపు మళ్లించి భావిభారత శాస్త్రవేత్తలుగా తయారు చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళుతోంది. ఇందులో భాగంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 10 నుంచి 15 ఏళ్ల వయస్సు గల 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల మేధస్సుకు పదును పెడుతోంది. ప్రధానమంత్రి కలల ప్రాజెక్టు స్టార్టప్ ఇండియా దిశగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేసింది. ప్రయోగాలు, ఆవిష్కరణలు, కొత్త ఆలోచనల దిశగా 2022-23 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తోంది. ప్రాజెక్టుల తయారీ కోసం ప్రతి విద్యార్థికి రూ.10వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. హనుమకొండ జిల్లాలో 103 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఈ ప్రాజెక్టుల ప్రదర్శన ఈసారి ఆన్‌లైన్ వేదికగా నిర్వహించనున్నారు.

ఆన్‌లైన్‌లో ఇన్‌స్పైర్ మనక్ పోటీలు

ఆన్‌లైన్ ప్రత్యేక యాప్ ద్వారా ప్రాజెక్టుల ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 18వ తేదీ వరకు జిల్లాస్థాయి పోటీల కోసం యాప్‌లో ప్రాజెక్టుల వివరాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. 19వ తేదీ నుంచి 25వ తేదీ వరకు మూల్యాంకనం చేసి 26న రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ప్రాజెక్టులను ఎంపిక చేసి ప్రకటిస్తారు. 26 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు యాప్‌లో ప్రాజెక్టుల వివరాలు అప్‌లోడ్ చేయాలి. ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు మూల్యాంకనం చేసిన అనంతరం జాతీయస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనే వి ద్యార్థుల జాబితాను విడుదల చేస్తారు.

అప్‌లోడ్ ఇలా..

ఫోన్‌లోని గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఇన్‌స్పైర్ మనక్ కాంపిటీషన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. తర్వాత ప్రాజెక్టుకు ఎంపికైన విద్యార్థి రిజిస్ట్రేషన్, ఓటీపీ, పాస్‌వర్డ్ ఎంటర్ చేసి లాగిన్ కావాల్సి ఉంటుంది. విద్యార్థి పేరు, పాఠశాల పేరు, ప్రాజెక్టు విషయాలు కనిపించగానే వాటిని ఒకసారి సరిచూసుకొని ముందుకు వెళ్లాలి. ఆ తర్వాత అప్‌లోడ్ చేసి ప్రాజెక్టుకు సంబంధించిన వీడియో, ఆడియో, ఫొటోలను నమోదు చేయాలి. వీడియో 2 నిమిషాలు ఉండి 30 ఎంబీ దాటకూడదు. ఫొటోలు నాలుగు వరకే నమోదు చేయాలి. దీంతోపాటు వాయిస్ రికార్డులో ప్రయోగ వివరణ ఇవ్వాలి. వివరాలు అన్నీ సరిచూసుకొని సబ్మిట్ ఎంట్ చేయాలి.

అప్‌లోడ్ చేయడంలో జాగ్రత్తలు తీసుకోవాలి



ఎస్.శ్రీనివాసస్వామి, జిల్లా సైన్స్ అధికారి

ఇన్‌స్పైర్ మనక్ పోటీలను ఈసారి ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నందున ప్రాజెక్టుల అప్‌లోడ్ చేయడంలో జాగ్రత్తలు తీసుకోవాలి. పోటీల సూచనలను చక్కగా చదువుకొని అర్థం చేసుకొని అప్‌లోడ్ చేయాలి. ఈ నెల 18వ తేదీ వరకు జిల్లాస్థాయి పోటీల కోసం యాప్‌లో ప్రాజెక్టుల వివరాలు అప్‌లోడ్ చేయాలి. సందేహాల నివృత్తి కోసం 9490112848 సెల్ నెంబరులో సంప్రదించవచ్చు.

భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహదం



అబ్దుల్‌హై, డీఈవో

విద్యార్థులను పాఠశాలల స్థాయిలోనే శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి. వారిలో దాగి ఉన్న సృజనాత్మకతకు పదునుపెట్టాలి. ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనతో విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయడంవల్ల భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహద పడుతుంది. జిల్లా నుంచి ఎంపికైన విద్యార్థులతో ఉత్తమ ప్రాజెక్టులను తయారు చేయించడానికి గైడ్ టీచర్లు కృషి చేయాలి.

ఉజ్వల భవిష్యత్‌కు 'నవోదయం'



మామునూరు జవహర్ నవోదయ విద్యాలయం

ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు కార్పొరేట్ స్థాయి విద్య

- ▸▸ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరం
- ▸▸ ఈనెల 20న ప్రవేశ పరీక్ష.. ఏర్పాట్లు పూర్తి
- ▸▸ ఉమ్మడి వరంగల్ జిల్లాలో 26 పరీక్షా కేంద్రాలు

జఫర్‌గడ్, జనవరి 12: అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఆధునిక విద్యనందిస్తూ విద్యార్థులను ఉత్తమ విలువలతో కూడిన పౌరులుగా తీర్చిదిద్దుతూ మన్ననలు అందుకుంటోంది ఉమ్మడి వరంగల్ జిల్లా మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయం. ఇందులో కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచితంగా విద్యనందిస్తూ అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నారు. 6వ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థికి ఇంటర్ మీడియట్ వరకు సీబీఎస్ఈ సిలబస్ ప్రకారం విద్యనందిస్తున్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఈనెల 20న ప్రవేశ పరీక్షను నిర్వహించబోతున్నారు.

జిల్లాల వారీగా పరీక్ష కేంద్రాలు, విద్యార్థులు

ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలతో పాటు సిద్దిపేట జిల్లాలో పరీక్ష కేంద్రాలు, ప్రవేశ పరీక్షకు హాజరుకాబోయే అభ్యర్థుల వివరాలను నవోదయ ప్రిన్సిపాల్ బి.పూర్ణిమ వెల్లడించారు. జనగామ జిల్లాలో 3 పరీక్ష కేంద్రాల్లో 674 మంది, మహబూబాబాద్ జిల్లాలో 5 పరీక్ష కేంద్రాల్లో 1,162 మంది. ములుగు జిల్లాలో 3 పరీక్ష కేంద్రాల్లో 521 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఒక పరీక్ష కేంద్రంలో 238 మంది, వరంగల్ జిల్లాలో 9 పరీక్ష కేంద్రాల్లో 2,082 మంది, హన్మకొండ జిల్లాలో 4 పరీక్ష కేంద్రాల్లో 837 మంది. సిద్దిపేట జిల్లాలో ఒక పరీక్ష కేంద్రంలో 124 మంది చొప్పున మొత్తం 26 పరీక్ష కేంద్రాల్లో, 5,638 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు.

ప్రవేశ పరీక్ష విధానం

ఈనెల 20వ తేదీ శనివారం ఉదయం 11-30 నుంచి మధ్యాహ్నం 1-30 గంటల వరకు ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలతో పాటు సిద్దిపేటలో ఏర్పాటు చేసిన 26 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ రూపంలో ఉంటాయి. మొత్తం రెండు గంటల వ్యవధిలో 100 మార్కులకు.. మూడు విభాగాల్లో పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో మేధాశక్తి పరీక్షలో 50 మార్కులతో కూడిన 50 ప్రశ్నలు (60 నిమిషాల సమయం), గణితం విభాగంలో 25 మార్కులతో కూడిన 25 ప్రశ్నలు (30 నిమిషాల సమయం), బాషా విభాగంలో 25 మార్కులతో కూడిన 25 ప్రశ్నలు (30 నిమిషాల సమయం) చొప్పున ఉంటాయి. ప్రశ్నలకు సమాధానాలు ఐసీఆర్/ఓసీఆర్ షీట్లలో అంకెల రూపంలో గుర్తించాలి. నెగెటివ్ మార్కులు ఉండవు.

అభ్యర్థులు గుర్తుంచుకోవాల్సిన అంశాలు

పరీక్షలు రాసేవారందరూ చిన్నారులే కావడంతో ఓసీఆర్ షీట్లలో సమాధానాలు గుర్తించాల్సి ఉండడంతో తడబాటు ఉంటుంది. అది పోవాలంటే కింది అంశాలను గుర్తుంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

- సమాధానాలు గుర్తించడానికి నీలి లేదా నలుపు (బ్లూ, బ్లాక్) బాల్ పెన్ను మాత్రమే వినియోగించాలి.
- ఒక్కసారి సమాధానం రాసిన తరువాత మార్చుట, కొట్టివేయుట, దిద్దడం చేయకూడదు.
- ఒక ప్రశ్నకు సుమారు ఒక నిమిషం పడుతుంది. అందువల్ల ఒక్క ప్రశ్న గురించి ఎక్కువ సమయం తీసుకోకూడదు. దానిని వదిలి మరో ప్రశ్నకు జవాబు రాసే ప్రయత్నం చేయాలి. దీని వల్ల సమయం ఆదా తగ్గుతుంది. అన్ని ప్రశ్నలకు జవాబులు గుర్తించాక.. నెగెటివ్ మార్కులు ఉండవు కాబట్టి వదిలివేసిన ప్రశ్నలుంటే అపుడు వాటిని ఆలోచించి సమాధానాలు గుర్తించాలి.
- బుక్‌లెట్‌లో గల మూడు విభాగాల్లో అభ్యర్థులు ఉత్తీర్ణులు కావాల్సిందే. అందువల్ల అవసరానికి మించిన సమయం ఒక్కో విభాగంపై వృథా చేయరాదు.
- ప్రతి 30 నిమిషాలకు ఒకసారి బెల్ కొడతారు. అది గమనించి పరీక్ష రాయాలి.
- పరీక్షకు గంట సమయం ముందే ఆయా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి.

18న పరీక్ష నిర్వాహకులకు శిక్షణ

నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహణలో విధులు నిర్వహించే 26 మంది పరీక్ష కేంద్రాల పర్యవేక్షకులు, 26 మంది పరిశీలకులు, రూట్ అధికారులకు ఈనెల 18వ తేదీన మామునూరులోని నవోదయ విద్యాలయంలో శిక్షణ ఇవ్వనున్నారు. పారదర్శక పరీక్ష విధానం, పరిశీలన, పర్యవేక్షణ, నియమ నిబంధనలు వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. పరీక్ష సక్రమ నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై వివరించనున్నారు.

పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

బి.పూర్ణిమ, ప్రిన్సిపాల్, మామునూరు నవదోయ విద్యాలయం



ప్రవేశ పరీక్షను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలతో పాటు సిద్దిపేట జిల్లాల్లో 26 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఏడు జిల్లాల పరిధిలోని మొత్తం 5,638 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలి. రిజర్వేషన్, ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది. విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు గంట సమయం ముందే చేరుకోవాలి. ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో ఎవరికేని హాల్ టికెట్ అందని పక్షంలో మామునూరు నవోదయ విద్యాలయంలో లేదా హెల్ప్‌లైన్ నంబరు 7780408933కు సంప్రదించాలి.

సీపీని కలిసిన ములుగు ఎస్పీ



సీపీకి పూల మొక్కను అందిస్తున్న ములుగు ఎస్పీ

హనుమకొండ క్రైం, జనవరి 12: ములుగు ఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శబరీష్ శుక్రవారం వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝూను కలిశారు. సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. ములుగు ఎస్పీకి సీపీ శుభాకాంక్షలు తెలిపారు. ఇద్దరు అధికారులు శాంతిభద్రతల పరిరక్షణపై కాసేపు మాట్లాడుకున్నారు.

హేమాచలుడి హుండీ ఆదాయం రూ.7 లక్షలు



హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో హుండీలలో భక్తులు వేసిన కానుకలను లెక్కిస్తున్న అర్చక, ఉద్యోగులు

మంగపేట, జనవరి 12: మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో హుండీల్లో భక్తులు వేసిన కానుకలను శుక్రవారం లెక్కించారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపం వద్ద ఎండోమెంట్ పరకాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ ధరణికోట అనిల్‌కుమార్ పర్యవేక్షణలో గత సెప్టెంబరు 30 నుంచి 2024 జనవరి 11 వరకు భక్తులు వేసిన కానుకలను బందోబస్తు మధ్య లెక్కించారు. మొత్తం ఏడు హుండీల ఆదాయం రూ.7,14,437 ఆదాయంతో పాటు వెండి, కొన్ని రెండు వేల నోట్లు, ఇతర మొక్కులు సమకూరాయని ఈవో శ్రవణపు సత్యనారాయణ, చైర్మన్ నూతలకంటి ముకుందం, ప్రధానార్చకులు కైంకైర్యం రాఘావాచార్యులు, ఎం.రాజశేఖరశర్మలు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పవన్‌కుమారచార్యులు, ఈశ్వర్ చంద్‌శర్మ, వెంకటనారాయణశర్మ, మురళీకృష్ణశర్మ, రాజీవ్ నాగశర్మ, ఉద్యోగులు సీతారాములు, సుధీర్, వలంటీర్లు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో ఒకరికి పదేళ్ల జైలుశిక్ష

వాజేడు, జనవరి 12: లైంగిక దాడి కేసులో ముద్దాయికి ములుగు జిల్లా కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. వివరాలిలా ఉన్నాయి. 2021లో మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై వెంకటాపురం మండలం మహితాపురంకు చెందిన గొంది శ్రీకాంత్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. వాజేడు పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న అప్పటి సీఐ శివప్రసాద్, ఎస్సై ఎస్.రాము నిందితుడిపై చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ బండారి కుమార్, ఎస్సై వెంకటేశ్వరరావుల పర్యవేక్షణలో సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి పి.లలితశివజ్యోతి సదరు ముద్దాయికి పదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.18వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పును వెలువరించారు. ఈ కేసును అడిషనల్ పీపీ సీహెచ్.సత్యనారాయణ వాదించగా, కోర్టు లైజన్ ఆఫీసర్ కమలాకర్, కోర్టు కానిస్టేబుల్ నాగరాజు పాల్గొన్నారు.



పర్వతాన్ని అధిరోహిస్తున్న సతీష్

కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన యువకుడు

చెన్నారావుపేట, జనవరి 12: ఆఫ్రికా ఖండంలోనే అత్యంత ఎత్తైన కిలిమంజారో పర్వతాన్ని ఓ యువకుడు అధిరోహించాడు. మండలంలోని పాత ముగ్దుంపురం గ్రామానికి చెందిన ఇల్లా సతీష్ అనే యువకుడు ఆఫ్రికా దేశంలోని ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. అక్కడే రాక్ క్లయింబింగ్‌ను నేర్చుకున్నాడు. ఈనెల 8న పై 5,895 మీటర్ల ఎత్తున్న కిలీమంజారో పర్వత్వాన్ని నాలుగు రోజులు శ్రమించి ఎక్కాడు. కాగా, ఈవిషయాన్ని శుక్రవారం గ్రామస్థులు తెలిపారు. ఎంతో సాహసంగా పర్వతాన్ని అధిరోహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. గతంలోనూ జంగి జంప్‌లో భాగంగా ప్రయాణిస్తున్న విమానం నుంచి ప్యారాచూట్‌తో జంప్ చేసినట్టు పేర్కొన్నారు. గత సంవత్సరం 5,364 మీటర్ల ఎత్తులో ఉన్న మౌంట్ ఎవరెస్టును ఎక్కి బేస్ క్యాంపును అధిరోహించాడు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

డీటీఎఫ్ అకడమిక్ సెల్ కన్వీనర్ బి.రామకృష్ణ



మాట్లాడుతున్న రామకృష్ణ

హనుమకొండ రూరల్, జనవరి 12: సమాజంలోని అంతరాలు తొలగిపోవాలంటే విద్యనే సరైన సాధనమని, అందుకు నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డీటీఎఫ్ అకడమిక్ సెల్ కన్వీనర్ బి.రామకృష్ణ అన్నారు. శుక్రవారం హనుమకొండలలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ఆధ్వర్యంలో విద్యా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా బి.రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరుగుతుందే కానీ.. ఆశించిన ఫలితాలు రావడం లేదన్నారు. ఇప్పటికైనా విద్యారంగంలో సమూల మార్పుల కోసం ప్రభుత్వం విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. 'ఉపాధ్యాయ ఉద్యమం మహిళల పాత్ర-సవాళ్లు' అనే అంశంపై అధ్యాపక జ్వాల పత్రిక సంపాదకురాలు జి.కళావతి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఉద్యమంలో మహిళల పాత్ర పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అప్పుడు సమస్యల పరిష్కారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసులు, టి.సుదర్శనం, ఎ.గోవిందరావు, కె.యాకయ్య, సముద్రాల అనిత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి, ఎం.గంగాధర్, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.రాజ్ కుమార్, సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాలిపటాలు ఎగురువేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

నయీంనగర్, జనవరి 12: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని 18 జిల్లాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు, చిన్నారులకు గాలిపటాలు ఎగురవేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో సీఎండీ వరుణ్‌రెడ్డి శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. విద్యుత్ తీగలు, సెల్‌ఫోన్ టవర్‌లు ఉన్న చోట గాలిపటాలు ఎగురవేయకూడదని, రోడ్ల వెంట గాలిపటాల కోసం పరుగులు పెట్టవద్దని, ఇంటి దాబాలపై విద్యుత్ లైన్లు ఉన్న దగ్గర గాలిపటాలు ఎగరవేయకూడదని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు దాబాలపై వెళ్లకుండా చూడాలని, వినియోగదారులు ఎప్పటికప్పుడు విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, సంక్రాంతి పండుగను వినియోగదారులందరూ సంతోషంగా జరుపుకోవాలని సీఎండీ వరుణ్‌రెడ్డి కోరారు.

అలిశెట్టి ప్రభాకర్‌కు ఘన నివాళి

▸▸ కాళోజీ విగ్రహం వద్ద జయంతి, వర్ధంతి



కాళోజీ విగ్రహం వద్ద అలిశెట్టి ప్రభాకర్ చిత్రం ముందు నివాళులర్పిస్తున్న తెరవే ప్రతినిదులు

హనుమకొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కష్టజీవులకు ఇరువైపు నిలబడ్డ కవి అలిశెట్టి ప్రభాకర్ అని తెలంగాణ రచయితల వేదిక (తెరవే) హనుమకొండ శాఖ అధ్యక్షుడు సాదు మహేందర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని ప్రజాకవి కాళోజీ విగ్రహం వద్ద అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కవులు టి.ఆనందాచారి, వి.రాంబ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు. ప్రభాకర్ కవితలను చదివి వినిపించారు.

మార్కెట్‌కు సంక్రాంతి సెలవులు

వరంగల్‌టౌన్, జనవరి 12: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నాలుగురోజులు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి సంగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం వారంతపు సెలవు, ఆదివారం భోగి, సాధారణ సెలవు, సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగలను పురస్కరించుకుని సెలవులు ప్రకటించినట్టు పేర్కొన్నారు. బుధవారం నుంచి మార్కెట్లో క్రయ విక్రయాలు యథావిధిగా సాగుతాయని వెల్లడించారు. రైతులు, వ్యాపారులు, కార్మికులు మార్కెట్ కమిటీకి సహకరించాలని కోరారు.

దివ్యాంగులకు ప్రత్యేక ఓపీ



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్

హనుమకొండ అర్బన్, జనవరి 12: వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంజీఎం ఓపీ బ్లాక్‌లో దివ్యాంగుల కోసం ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేసినట్లు ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఓపీని ఆర్‌ఎంవోలతో కలిసి ఆయన సందర్శించారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాధారణ ఓపీ సమయాలే ఈ ఓపీకి వర్తిస్తాయని పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి..

ఎమ్మార్పీఎస్- టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

కాళోజీ జంక్షన్, జనవరి 12: ఉద్యోగ భద్రత లేని పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలనే ఉద్దేశంతో ఫిబ్రవరి 29న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వేదికగా నిర్వహించ తలపెట్టిన పోరుగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ - టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి హనుమకొండ జిల్లా ఎమ్మార్పీఎస్ - టీఎస్ అధ్యక్షుడు రాజేష్‌ఖన్నా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వంగపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు కులాలకు ప్రాతినిధ్యం ఇచ్చి ఒక్కో కులానికి ఆర్థికంగా సహాయం చేశాయని అన్నారు. ఒక్కో కులానికి వేర్వేరు కుల వృత్తులు ఉన్నాయని వాటితోపాటు మాదిగలకు కూడా కుల వృత్తి ఉందని అన్నారు. కానీ సమాజంలో ఎంతో ఆధునికత సంతరించి వృత్తికి ఆదరణ లేక పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి మాదిగలను అక్కున చేర్చుకొని ఆదుకోవాలని ఆయన కోరారు. డప్పు, చెప్పు వృత్తిదారులకు నెలకు రూ. 5 వేల చొప్పున పెన్షన్ ఇవ్వాలని మంత్రివర్గంలో స్థానం కల్పించాలని ట్యాంక్ బండ్‌పై సదాలక్ష్మి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ -టీఎస్ నాయకులు ఇద్దునూరి యాకయ్య, రామంచ సారన్న, చిన్న స్వామి మాదిగ, రాష్ట్ర కార్యదర్శులు ఆరెపల్లి బాబన్న, దేవరకొండ సదానందం, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య, ములుగు జిల్లా అధ్యక్షుడు గడ్డం భద్రయ్య రాకేష్, సుధన్, అనిల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అవయవాల దానం



శ్రీకాంతాచారి (ఫైల్)

గీసుగొండ, జనవరి 12: వరంగల్ జిల్లా గీసుగొండ మండల కేంద్రానికి చెందిన చెందిన కర్ణకంటి శ్రీకాంతాచారి(27) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందగా, అతని అవయవాలను తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రికి దానం చేశారు. కుటుంబీకుల కథనం ప్రకారం.. శ్రీకాంతాచారి కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోని కేర్ హాస్పిటల్‌లో ఇన్సూరెన్స్ విభాగంలో పనిచేశాడు. ఏడాది కిందట అనారోగ్యానికి గురికాగా, వైద్యపరీక్షలు నిర్వహించగా బ్లడ్ క్లాటింగ్ అవుతున్నట్లు డాక్టర్‌లు గుర్తించి చికిత్స చేస్తున్నారు. తరుచూ తలనొప్పికి గురవుతుండటంతో కొద్దిరోజుల కిందట శ్రీకాంతాచారి ఇంటికి ఇక్కడే ఉంటున్నాడు. రెండు రోజుల కిందట తలనొప్పితోపాటు మెడభాగంలో నొప్పిరావడంతో అతడిని కేర్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. బతికున్నప్పుడు శ్రీకాంతాచారి చెప్పిన సూచన మేరకు తల్లిదండ్రులు అతడి అదే ఆస్పత్రి(కేర్)కి అవయవాలను దానం చేశారు. శ్రీకాంతాచారి అంత్యక్రియలు సాయంత్రం గీసుగొండలో నిర్వహించారు. శ్రీకాంతాచారి తల్లిదండ్రులు బ్రహ్మచారి, సరస్వతి వడ్రంగి పనిచేస్తూ జీవిస్తుండగా, ముగ్గురు అన్నలు ఉన్నారు. ఈఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రేపు కైట్ ఫెస్టివల్

ఆర్ట్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో నిర్వహణ

హనుమకొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కైట్ ఫెస్టివల్ (పతంగుల పండుగ)ను ఈనెల 14న సంక్రాంతి పర్వదినం రోజు నిర్వహించాలని నిర్ణయించారు. వాస్తవానికి సంక్రాంతికి ఒక రోజు ముందు శనివారం నిర్వహించాలని ముందుగా అనుకున్నప్పటికీ వీలుకాకపోవడంతో ఆదివారంరోజున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించాలని నిర్ణయించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో జరిగే పతంగుల పండుకను కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రారంభిస్తారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్న ఈ ఉత్సవంలో పతంగుల ఎగురవేతలో ఆసక్తికలిగిన ప్రతి ఒక్కరు పాల్గొనవచ్చునని నిర్వాహకులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నయీంనగర్, జనవరి 12: ఎన్‌పీడీసీఎల్ హనుమకొండ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని న్యూశాయంపేట ప్రాంతంలో శనివారం ఉదయం 8.30గంటల నుంచి 11.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నారు. అదేవిధంగా బాలసముద్రంలో ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు, నక్కలగుట్టలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆర్ఈసీ, సోమిడి ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రాంపూర్, మడికొండ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నారు. ఈ మేరకు హనుమకొండ డివిజన్ ఇంజనీర్ ఎలక్ట్రికల్, ఆపరేషన్స్ జి.సాంబరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చిందు కళాకారులకు ప్రోగ్రాంలను కేటాయించాలి



సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ అశోక్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న గజవెల్లి సారయ్య

వడ్డెపల్లి, జనవరి 12: కళారంగాన్ని జీవనోపాధిగా మలుచుకొన్న చిందు యక్షగాన కళాకారులకు ప్రభుత్వ పథకాలను కేటాయించాలని చిందు యక్షగాన కళాకారుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గజవెల్లి సారయ్య సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ అశోక్‌రెడ్డిని హైదరాబాద్‌లోని కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా గజవెల్లి సారయ్య మాట్లాడుతూ.. మేడారం జాతరలో చిందు యక్షగాన కళాకారులకు ప్రోగ్రాంలు అప్పజెప్పడంతో పాటు పండుగలు, ఇతర జాతరలలో సైతం కళా ప్రదర్శనలు ఇచ్చి ప్రజలను చైతన్యపర్చేందు కోసం ప్రభుత్వం అవకాశం కల్పించాలని కోరారు. 50 సంవత్సరాలు పైబడిన వృద్ధ కళాకారులకు నెలకు రూ. 6వేల చొప్పున పెన్షన్ మంజూరు చేయాలని, యువ కళాకారులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, నివేశన స్థలాలు మంజూరి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకుడు డీఎస్. జగన్‌ను సైతం మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు.

ఇంజనీరింగ్ అధికారులతో కడియం భేటీ

నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న కడియం

హనుమకొండ టౌన్, జనవరి 12: స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి సంబంధించి పంచాయతీరాజ్ విభాగానికి చెందిన అభివృద్ధి పనులపై స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇంజనీరింగ్ అధికారులతో భేటీ అయ్యారు. శుక్రవారం హనుమకొండ జడ్పీ కార్యాలయంలో పీఆర్ ఎస్ఈ రఘువీరారెడ్డి, ఈఈ శంకరయ్యతో పాటు పలు ఇంజనీరింగ్ అధికారులతో భేటీ అయిన కడియం శ్రీహరి అభివృద్ధి పనులను సమీక్షించారు. నియోజకవర్గంలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పీఎంజీఎస్‌వై, సీడీపీ తదితర నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కడియం సూచించారు. మంజూరైన పనులకు వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలన్నారు.

ఈనెలాఖరుతో సర్పంచ్‌ల పదవీకాలం పూర్తవుచున్నందున చేసిన పనులను వెంటనే రికార్డు చేయాలన్నారు. నాణ్యతతో పనులు జరిగేలా ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని కడియం శ్రీహరి అధికారులకు సూచించారు. కాగా, ఎమ్మెల్యేగా విజయం సాధించి తొలిసారి జడ్పీకి వచ్చిన కడియంకు ఇంజనీరింగ్ అధికారులు స్వాగతం పలికి సత్కరించారు.

కొత్తకొండలో భక్తులకు విస్తృత ఏర్పాట్లు

భీమదేవరపల్లి, జనవరి 12: కొత్తకొండ వీరభద్రస్వామి జాతరలో భక్తులకు విస్తృత ఏర్పాట్లు కల్పించాలని అధికారులను అడిషనల్ కలెక్టర్ రాధికగుప్తా ఆదేశించారు. శుక్రవారం దేవాలయంలో శ్రీవీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు కల్పించాల్సిన ఏర్పాట్లపై ఆర్డీవో రమేష్, ఎంపీడీవో భాస్కర్, ఆలయ ఈవో కిషన్‌రావులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జాతరకు వచ్చే భక్తుల సంఖ్యను బట్టీ ఏర్పాట్లు చేయాలన్నారు. క్యూలైన్లు, పారిశుధ్య నిర్వాహణ, వైద్యం, విద్యుత్, రవాణా, మంచినీరు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జాతర జరిగే రోజు నుంచి చివరి వరకు తాను అందుబాటులో ఉంటానని, ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా క్యూలైన్ల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. రాత్రి వేళల్లో జాతర జరుగుతుందని, 24 గంటల విద్యుత్ సరఫరా అయ్యే విధంగా అధికారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. పోలీసులు జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జాతరకు వచ్చే రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఏవైపు నుంచి రద్దీ ఎక్కువగా ఉంటుందో అక్కడ అధికారుల పర్యవేక్షణ ఎక్కువగా ఉండాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణపై డీపీవో జగదీష్‌తో అడిషనల్ కలెక్టర్ చర్చించారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్‌ఐలు సాయిబాబు, వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీవో నాగరాజు, మాజీ చైర్మన్లు పిడిశెట్టి కనకయ్య, చిట్టంపల్లి అయిలయ్య మాడిశెట్టి కుమారస్వామి, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇటుకబట్టీ నిర్వాహకుడిపై కేసు నమోదు

నెల్లికుదురు (మహబూబాబాద్ జిల్లా), జనవరి 12 : ఇటుక బట్టీలో బాలకార్మికుడితో పని చేయిస్తున్న నిర్వాహకుడిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని శ్రీరామగిరి స్టేజీ సమీపంలో ఖమ్మం జిల్లా అశ్వారావుపేట మండలం నందిపాడుకు చెందిన గుంజె వెంకటేశ్వర్లు తన ఇటుక బట్టీలో 14 ఏళ్ల బాలుడితో పనులు చేయిస్తున్నాడు. ఈ క్రమంలో లేబర్ ఆఫీసర్ గట్టిపెల్లి వినోద్‌కుమార్ పట్టుకొని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ వివరించారు.

డీసీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

▸▸ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



డీసీసీ బ్రాంచిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం, జనవరి 12: సహకార బ్యాంకుల సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం గణపురం మండల కేంద్రంలో డీసీసీ బ్యాంకు శాఖ ప్రారంభోత్సవానికి డీసీసీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డీసీసీ బ్యాంకు అందించే హోమ్ లోన్, పర్సనల్ లోన్, గోల్డ్ లోన్, ఎడ్యుకేషన్ లోన్, వెహికిల్స్ లోన్ తదితర రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కమర్షియల్ బ్యాంకులతో సమానంగా సేవలందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గండ్ర పద్మ, పీఏసీఎస్ చైర్మన్ పూర్ణ చందర్‌రెడ్డి, చెల్పూరు పీఏసీఎస్ చైర్మన్ గండ్ర సత్యనారాయణరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనరసింహారావు, వైస్ ఎంపీపీ అశోక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పొట్ల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

ఐటీడీఏ పీవో అంకిత్, ఓఎస్డీ అశోక్‌కుమార్

మేడారంలో పలు అభివృద్ధి పనుల పరిశీలన



బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌ను పరిశీలిస్తున్న పీవో అంకిత్, ఓఎస్డీ

మేడారం, జనవరి 12: మహా జాతర నేపథ్యంలో మేడారంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, ఓఎస్డీ అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. తాడ్వాయి మండలం మేడారంలో భక్తుల సౌకర్యార్థం జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం వారు పరిశీలించారు. జంపన్న వాగు వద్ద స్నానఘట్టాలు, తాత్కాలిక మరుగుదొడ్లు, పార్కింగ్ స్థలాలు, చిలకల గుట్ట వద్ద చేపట్టిన పనులను, తాగునీటి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. భక్తులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పనులను పరిశీలిస్తూ నివేదికలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో వసంతరావు, ఎస్‌వో రాజ్‌కుమార్, ఇంజనీరింగ్ అధికారులు అజయ్‌కుమార్, సుభాష్, సతీష్, సదయ్య, సీఐ శంకర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీడియా భవనం కోసం స్థల పరిశీలన

మేడారం మహా జాతర ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజుల పాటు జరుగనున్న నేపథ్యంలో మీడియా లైవ్‌ల కోసం మీడియా పాయింట్ ఏర్పాటునకు ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ప్రస్తుత మీడియా పాయింట్ రద్దీగా మారుతుండడంతో పక్కనే గద్దెల ప్రాకారం అంచున మరో భవనం నిర్మించనున్నారు. ఈ క్రమంలో ఈ భవనానికి మరో పక్క పూజారుల రహస్య పూజా మందిరం ఉంది. దీంతో పూజారులు పలు అభ్యంతరాలు తెలుపుతున్నారు. అందుకు మరో స్థలాన్ని పరిశీంచడం జరిగిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మేడారంలో టెంట్ సిటీ ఏర్పాటు

మేడారంలో భక్తుల వసతికి ప్రైవేటు టెంటెడ్ అకామిడేషన్ శుక్రవారం ప్రారంభం అయ్యాయి. పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ఈ టెంట్ సిటీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా జాతరకు సమయం దగ్గర పడుతుందని అన్నారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో తరలివచ్చి ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారని తెలిపారు. వరద ముంపుతో అతిథి గృహాలు ధ్వంసం అయ్యాయని, భక్తులకు వసతికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. టెంట్ సిటీ కొంత మేరకు వసతిని కల్పిస్తుందని, భక్తులు ఉపయోగించుకునేలా తక్కువ ధరతో అందుబాటులోకి రావడం సంతోషకరమని అన్నారు.



ధర్మకంచ జూనియర్ కళాశాలలో ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో డీఐఈవో శ్రీనివాస్ తదితరులు



కొడకండ్ల జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అశోక్



నర్మెటలో స్వామి వివేకానంద చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న వివిధ పార్టీల నాయకులు



శివునిపల్లిలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న సీఐ సట్ల రాజు

ఘనంగా వివేకానంద జయంతి

- నివాళులర్పించిన విద్యాసంస్థలు

జనగామ కల్చరల్, జనవరి 12: స్వామి వివేకానంద జయంతిని జిల్లాలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ మంజుల అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మెప్మా పీడీ హర్షవర్ధన్ హాజరై మాట్లాడారు. స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని యువత నిరంతర కృషితో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివేకానంద జయంతి సందర్భంగా హైద్రాబాద్ శిల్పారామంలో జరిగిన రాష్ట్ర స్థాయి జానపద నృత్య పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డీఐఈవో ప్రశంసా పత్రాలు అందజేశారు. జానపద కళలో విద్యార్థులను ప్రోత్సహించి రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లిన అధ్యాపకురాలు ప్రియదర్శినిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నందిని పటేల్, రామస్వామి, వస్కుల శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, తిరుమలేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సాయితేజ ఐటీఐలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి బి.రవీందర్ ముఖ్య అతిథిగా హాజరు కాగా ప్రిన్సిపాల్ వెంకటేశం, దేవరాయ ఎల్లయ్య, సౌద రమేష్, జనగామ ఫ్రెండ్స్ యూత్ ప్రతినిధులు దేవరాయ ప్రశాంత్‌కుమార్, చొప్పరి ప్రశాంత్ పాల్గొన్నారు.

వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని లక్ష్మీబాయి కుంటలో పేద విద్యార్థులకు పెన్నులు, నోటు పుస్తకాలు, జ్యామెట్రీ బాక్సులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి రూ.400.ల విలువ గల వస్తువులను అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు మేక బాలసిద్దయ్య, దొంతుల శేఖర్ మాట్లాడుతూ పిల్లలు లక్ష్యంతో కష్టపడితే సాధించలేనిది ఉండదన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు, యాదగిరిరెడ్డి, సుఖేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సీఐ సట్ల రాజు అన్నారు. శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉత్తమ పౌర సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సీఐ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత వివేకానంద అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. భారత దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు స్వామీ వివేకానంద అన్నారు.

ప్రముఖ రచయిత్రి, కవయిత్రి నెల్లుట్ల రమాదేవి మాట్లాడుతూ దురలవాట్లతో సమయాన్ని, చదువును, భవిష్యత్తును నాశనం చేసుకుంటున్న యువత ఆయన బోధనలు చదవాలని, ఆత్మ విశ్వాసం పెంపొందించుకోవాలన్నారు. దేశభక్తి, ఆధ్యాత్మికత బాటలో నడవాలన్నారు.

విద్య, క్రీడల్లో ప్రతిభ చూపిన 30 మంది యువకులకు సీఐ రాజు, రమాదేవి శాలువాలు కప్పి అభినందించారు. కార్యక్రమంలో శివునిపల్లి సర్పంచ్ బూర్ల విష్ణు, ఎంపీటీసీ రాజు, నిర్వాహకులు యంజాల ప్రభాకర్, దస్తగిరి, నాగబండి వెంకట్రామనర్సయ్య, వి.తిరుమల శ్రీనివాస్, ప్రొఫెసర్ డి.కుమారస్వామి, హెచ్‌ఎం కె.రమేశ్, డాక్టర్ హేమంత్‌రాజు, రాపర్తి సుధాకర్, జీవై గిరి, గోలి రాజశేఖర్, కె.శరత్‌కుమార్ పాల్గొన్నారు.

లింగాలఘణపురం: మండల కేంద్రంలో జడ్పీహైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో స్వామివివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామపంచాయతీ నుంచి స్వామివివేకానంద పార్క్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో చెన్నూరు మల్లేశం, సర్పంచ్ విజయమనోహర్, హెచ్‌ఎం మల్లికార్జున్, వంగ మురళి, కేమిడి వెంకటేశ్, నీలం మోహన్, కేలపు లక్ష్మీనారాయణ, ఇటుకల చందు, ఏదునూరి నాగరాజు, బిట్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి: మండలంలోని కోమల్ల గ్రామంలో బీజేపీ నాయకులు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మంద వెంకటేష్ యాదవ్, వల్లాల ఉపేందర్, శ్రీనివాస్, నరేష్, సదానందం, సత్తయ్య, బోయిన కొంరయ్య, జంగిడి యాదగిరి పాల్గొన్నారు.

కొడకండ్ల: బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు పి.ఉపేందర్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అశోక్ మాలి ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎస్. కోటేశ్వర్ ఎం.సోమన్న, హరికృష్ణ, రమేశ్, సాయి, గణేష్, శ్రీనివాస్, వెంకటయ్య, ప్రభుత్వ కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

నర్మెట: వివిధ పార్టీల ఆధ్వర్యంలో మండలకేంద్రంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి పండ్లు పంపిణీ చేశారు. దేశానికి బలం, బలహీనత యువతే అని చాటిచెప్పిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజు, బత్తుల నరేందర్, ఎమ్మార్పీఎస్ నాయకుడు కొంపెల్లి అంబేద్కర్, యూత్ కాంగ్రెస్ నాయకుడు ప్రజ్ఞాపురం శ్రీధర్, బిజ్జ గోవర్ధన్, బాలకృష్ణ, ప్రభాకర్, జహంగీర్, నాగేష్, ప్రకాష్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



జనగామ ఏకశిల పబ్లిక్ స్కూల్ లో ముగ్గులు వేస్తున్న విద్యార్థినిలు



జిల్లా కోర్టులో ముగ్గులను పరిశీలిస్తున్న జడ్జి రవీంద్రశర్మ

జనగామ కల్చరల్, జనవరి 12: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పాఠశాలల్లో పలు విద్యాసంస్థల్లో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ ఇందిర నేతృత్వంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థినిలు సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా దుస్తులు ధరించారు. విద్యార్థినిలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సి.ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అదేవిధంగా నెహ్రూ పార్కు సెయింట్ మేరీస్ పాఠశాలలో ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థినిలతో పాటు మహిళామణులు ముగ్గులు వేసి అలరించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. ఈ పోటీలలో మాధవి ప్రథమ బహుమతి, స్వాతి ద్వితీయ, సంతోషిని తృతీయ బహుమతి గెలుచుకున్నారు. గెలిచిన విజేతలకు ప్రధానోపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

జిల్లా కోర్టు ఆవరణలో..

జనగామ టౌన్: జిల్లా కోర్టులో జనగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది రంగురంగుల ముగ్గులు వేయగా జిల్లా జడ్జి రవీంద్ర శర్మ పరిశీలించారు. విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి న్యాయవాది మేకల స్వప్న, రెండో బహుమతి కోర్టు సిబ్బంది కీర్తన, మూడో బహుమతి న్యాయవాది యు.స్వాతి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూరెళ్ల శ్రీనివాస్, కార్యదర్శి రాజయ్య, స్పోర్ట్స్ సెక్రటరీ పసునూరి మురళి, చెరుకు చంద్రశేఖర్, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

పాలకుర్తి: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని లయన్స్ క్లబ్, సేవా భారతి ఆధ్వర్యంలో గుడివాడలోని పంచగుళ్ల వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు అత్యధిక సంఖ్యలో హాజరై పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, సీఐ విశ్వేశ్వర్, గంటా రవీందర్, ఎస్సై శ్రీకాంత్, లయన్స్ క్లబ్ బాధ్యుడు రాపాక విజయ్, మాజీ సర్పంచులు గంగు కృష్ణమూర్తి, మాచెర్ల పుల్లయ్య, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు సోమనాథం పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

హసన్‌పర్తి, జనవరి 12: హనుమకొండ జిల్లాలోని ఓ ప్రైవేటు యూనివర్సిటీలో రాథోడ్ దీప్తి (20) అనే విద్యార్థిని గురువారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన దీప్తి బీఎస్సీ(అగ్రికల్చర్) సెకండ్ ఇయర్ చదువుతోంది. తండ్రి మోతీలాల్ నాయక్ మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్‌గా పని చేస్తున్నారు. ఇటీవలే ప్రథమ సంవత్సరం పరీక్ష ఫలితాలు వెలువడ్డాయి. అందులో కొన్ని సబ్జెక్ట్‌ల్లో దీప్తి ఫెయిల్ అయింది. అప్పటినుంచి ఆమె కొంత మనస్తాపంతో వున్నట్టు తెలుస్తోంది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో దీప్తి గదిలో ఉండే తోటి విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం దీప్తి హాస్టల్ గది నుంచి బయటకు రాలేదు. దీంతో సిబ్బంది తలుపులు తెరిచి చూడగా, ఉరి వేసుకుని కనిపించింది. కళాశాల యాజమాన్యం సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

అయితే దీప్తి ఆత్మహత్యకు గల కారణాలు స్పష్టంగా తెలియడం లేదు. పరీక్షల్లో ఫెయిల్ కావడం వల్ల అఘాయిత్యానికి ఒడిగట్టిందా? లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కళాశాల యజమాన్యం నిర్లక్ష్యంతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని దీప్తి తండ్రి మోతీలాల్‌నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సమగ్ర విచారణ జరపాలి..

దీప్తి ఆత్మహత్యపై పోలీసులు సమగ్ర విచారణ జరపాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్‌కుమార్, గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజునాయక్, టీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, కన్నం అనిల్, విజయ్ డిమాండ్ చేశారు. యూనివర్సిటీ ఎదుట కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. యూనివర్సిటీ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

యువతి బలవన్మరణం

లింగాలఘణపురం, జనవరి12: మండలంలోని కుందారం గ్రామానికి చెందిన గట్టు వెన్నెల(23) అనే యువతి శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. ఆమె కుటుంబసభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. మంతపురి సోమయ్య కుమార్తె వెన్నెలకు ఐదేళ్ల క్రితం కోమల్లకు చెందిన ఓ వ్యక్తితో వివాహమైంది. కాగా పెళ్లైన ఐదు రోజులకే ఇద్దరి మధ్య గొడవలు జరిగి వెన్నెల భర్తకు విడాకులిచ్చి పుట్టింటికి వచ్చింది. అయితే ఏడాది కాలంగా తనకు మరో పెళ్లి చేయాలంటూ తల్లిదండ్రులపై ఒత్తిడి పెంచింది. దీంతో వారు ఓవైపు పెళ్లి సంబంధాలు చూస్తుండగానే మనస్తాపం చెంది పురుగుల మందుతాగి చనిపోయింది. ఎస్సై ప్రవీణ్ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కిరాణ షాపుల్లో పోలీసుల తనిఖీలు

పాలకుర్తి, జనవరి 12: మండల కేంద్రంలోని కిరాణ దుకాణాలు, పాన్‌షాపు, బేకరీల్లో సీఐ విశ్వేశ్వర్ నేతృత్వంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి వినియోగించినా, సరఫరా చేసినా కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల ఎస్సైలు శ్రీకాంత్, శ్రావన్‌కుమార్, శ్రావన్‌కుమార్, సిబ్బంది శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

1.5 కిలోల గంజాయి స్వాధీనం

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 12: డివిజన్ కేంద్రంలోని తాటికొండ క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు శుక్రవారం 1.5 కిలోల గంజాయిని పట్టుకున్నారు. పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో తాటికొండ గ్రామానికి చెందిన గుమ్మాల పవన్ అనే యువకుడు రూ.37,500 విలువైన 1.5 కిలోల గంజాయిని తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి గంజాయితో పాటు సెల్‌ఫోన్‌ను, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు పవన్‌పై కేసు నమోదు చేశామని, అతడి ఫోన్‌కాల్స్ ఆధారంగా విచారణ జరుపుతామని సీఐ రాజు తెలిపారు. గంజాయి నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై నాగరాజు, ఏఈవో దీపక్ పాల్గొన్నారు.

ఆలేటి ఎల్లవ్వ ఆలయానికి రూ.1.30 లక్షల ఆదాయం

పాలకుర్తి, జనవరి 12: మండలంలోని బమ్మెర గ్రామ శివారులో ఈ నెల 15, 16 తేదీల్లో జరిగే ఆలేటి ఎల్లవ్వ జాతరకోసం నిర్వహించిన వేలం ద్వారా రూ.1.30 లక్షల ఆదాయం వచ్చిందని సర్పంచు నాగభూషణం తెలిపారు. శుక్రవారం జీపీ కార్యలయంలో నిర్వహించిన వేలంలో బత్తిని మదన్‌మోహన్ కొబ్బరి కాయల హక్కు కోసం రూ. 80 వేలు టెండర్‌ను దక్కిచుకున్నారని, అదే విధంగా రాసాల రాజు ఎల్లవ్వ దర్శనం టికెట్ల విక్రయానికి రూ. 25 వేలు, నునావత్ చలపతి వాహనాల పార్కింగ్ కోసం రూ. 12,500, లూనావత్ శంకర్ దుకాణాల కోసం రూ.9,500, పెద్దూరి సందీప్ లడ్డు, ప్రసాదం విక్రయానికి రూ. 3వేలకు టెండర్లు దక్కించుకున్నట్లు తెలిపారు.

గెలుపు ఓటములను సమంగా స్వీకరించాలి

జిల్లా రా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



నాగిరెడ్డిపల్లిలో అతిథులను సన్మానిస్తున్న నిర్వాహకులు

బచ్చన్నపేట, జనవరి 12: గెలుపు, ఓటములను సమంగా స్వీకరించాలని, ఓడినవారు గెలుపు కోసం పట్టుదలతో కృషి చేస్తే విజయం వరిస్తుందని జిల్లా రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆటలపోటీలు నిర్వహించారు. స్థానిక సర్పంచ్ తాతిరెడ్డి భవాని శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను ఎస్‌ఐ సతీష్‌తో కలిసి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు క్రమశిక్షణను నేర్పుతాయన్నారు. చిన్నప్పటి నుండి చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు యత్నించాలని కోరారు. కాగా, క్రికెట్, క్యారం, చెస్ పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకు బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, గొల్లపల్లి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మాపూర్‌లో క్రికెట్ పోటీలు..

మండలంలోని లక్ష్మాపూర్‌లో ఈ నెల 13 నుంచి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్టు గ్రామానికి చెందిన నూకల బాల్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల క్రీడాకారులు పాల్గొనాలన్నారు. విజేతలకు ప్రథమ బహుమతి 12,116, ద్వితీయ బహుమతి 7,116 అందిస్తామని వారు తెలిపారు.

అయోధ్య రాముడి అక్షింతల వితరణ

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 12: మండలంలోని పాంనూర్ గ్రామంలో శుక్రవారం అయోధ్య రాముడి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. జనవరి 22న ప్రతీ ఇంట్లో దీపాలు వెలిగించి పండుగ జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కోతి రేణుక-రాములుగౌడ్, బీజేపీ వరంగల్ పార్లమెంట్ కో కన్వీనర్ ఇనుగాల యుగేంధర్ రెడ్డి, పొన్న భీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు జనగామలో పుస్తకావిష్కరణ

పాలకుర్తి, జనవరి 12: బహుజన సాహిత్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు నక్క సురేష్ రచించిన జ్ఞానపుష్పం పుస్తకాన్ని శనివారం జనగామలో ఆవిష్కరించనున్నట్లు సోమనాథ కళాపీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పాలకుర్తి రాజీవ్ చౌరస్తాలో వాల్‌పోస్టర్‌ను బహుజన సాహిత్య వేదిక బాధ్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మండలం నుంచి కవులు, రచయితలు, సాహిత్య అభిమానులు అధికసంఖ్యలో హాజరుకావాలని సత్యనారాయణ కోరారు.

ఫైబ్రో స్కానింగ్‌కు అపూర్వ స్పందన

జనగామ కల్చరల్, జనవరి 12: లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫైబ్రో స్కానింగ్‌కు అపూర్వ స్పందన లభించింది. శుక్రవారం జిల్లా కేంద్రం లోని ఆదిత్య హాస్పిటల్‌లో డాక్టర్ మాచర్ల భిక్షపతి సారథ్యంలో ఉచితంగా ఫైబ్రో స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. లివర్ స్కానింగ్ వల్ల లివర్ యొక్క స్థితిని తెలుసుకొని దానికి నివారణ చర్యలు చేపట్టడం ద్వారా భవిష్యత్తులో మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని డాక్టర్ మాచర్ల భిక్షపతి తెలిపారు. ఈ సందర్భంగా 100 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు జైన రమేష్ తెలిపారు. రూ.60 లక్షల విలువైన స్కానింగ్ మిషన్ ద్వారా ఈ పరీక్షలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్యం బద్రీనాథ్, దోర్నాల రమేష్, రవికిరణ్, రాజేష్, రాజేంద్రప్రసాద్, బుక్కాల శ్రీనివాస్, మర్యాల లక్ష్మణ్, గందె కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిలకు వస్త్రాల పంపిణీ

జనగామ కల్చరల్, జనవరి 12: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని విద్యార్థినిలకు డ్రెస్సులు పంపిణీ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రం లోని ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వైట్ అండ్ వైట్ అధినేత గజ్జి మధు సహకారంతో 150 మంది విద్యార్థినిలకు ఉచితంగా డ్రెస్సులు పంపిణీ చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ వేముల శేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఐఈవో భైరి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రానున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ గట్టు వెంకటేశ్వర్లు, సభ్యులు బెలిదె శ్రీధర్ పాల్గొన్నారు.

జీవ వైవిధ్య పార్కు ఏర్పాటుకు కృషి

జనగామ టౌన్, జనవరి 12: జనగామలో జీవ వైవిధ్య పార్కు ఏర్పాటుకు కృషి చేస్తామని జీవ వైవిధ్య ప్రాధికార సంస్థ ఛైర్మన్ అచలేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం జనగామ మునిసిపల్ కార్యాలయంలో జీవ వైవిధ్య యాజమాన్య కమిటీ కార్యదర్శి పేర్నే స్వరూప ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జాతీయ, తెలంగాణ జీవ వైవిధ్య మండలి నుంచి జనగామకు రూ.కోటి నిధులు మంజూరయ్యేలా చూస్తానన్నారు. అందుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. జనగామలో ఔషధ మొక్కల పెంపకం, హెర్బల్ పార్కుల అభివృద్ధిపై కమిటీ సభ్యులు ఛైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్ చంద్రమౌళి, తెలంగాణ జీవ వైవిధ్య మండలి సైంటిఫిక్ అధికారి డాక్టర్ శిల్పి శర్మ, యాజమాన్య కమిటీ సభ్యులు వాంకుడోతు అనిత, జి.కృష్ణ, పానుగంటి ప్రవీణ్‌కుమార్, గోపి పాల్గొన్నారు.

ఎర్రగొల్లపహాడ్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులు

జనగామ టౌన్, జనవరి 12: మండలంలోని ఎర్రగొల్లపహాడ్ గ్రామ కాంగ్రెస్ కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు చిర్ర సత్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రంగౌడ్ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా మేర్గు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పాలమాకుల యాదయ్య, బైరగోని శ్రవణ్, ప్రధాన కార్యదర్శిగా ద్యాగల రాజుకుమార, కార్యదర్శిగా మడికంటి శ్రీను, అజ్మీరా శివ, కోశాధికారిగా మారపాక భాస్కర్ ఎన్నికయ్యారు.

ఎర్రగొల్లపహాడ్ గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బైరగోని ప్రవీణ్, గౌరవ అధ్యక్షుడిగా ఎర్రబోయిన తిరుపతి, ఉపాధ్యక్షులుగా ఎస్.రాజు, దుడుక శ్రీను, ప్రధాన కార్యదర్శిగా పాలమాకుల ఎల్లేశ్, కార్యదర్శిగా పానుగంటి వెంకటేశ్, ఉస్తేపు కనకయ్య, కోశాధికారిగా ఓరుగంటి రాజు ఎన్నికయ్యారు.

సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఎన్నిక

జనగామ కల్చరల్, జనవరి 12: సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తీగల సిద్దిమల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా తాళ్ల వెంకటమల్లారెడ్డి, కోశాధికారిగా వి.రమేష్, ఉపాధ్యక్షులుగా గాదె క్యాథరిన్, గాదె ప్రకాశ్, మహమ్మద్ లతీఫ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అల్లాడి ప్రభాకర్‌రావు, సహాయ కార్యదర్శులుగా టి.సుకేశినిరాణి, ఎండి.ఆజం అలీ, యాదగిరిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా బెజుగం భిక్షపతి, మల్లం ప్రసాద్ ఎన్నికయ్యారు. స్థానిక లయన్స్ భవన్‌లో జరిగిన ఈ ఎన్నికలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.నరసింహారావు, మొగిలి గౌడ్, వెంకటయ్య గౌడ్, టి.వీరేశం, ఏ.రామస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి, కన్నా పరశురాములు, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.